

# బెడ్డింగుల్లో వెడ్డింగ్స్!

రాంపా

**ఇప్పట్లో రైలు మాత్రం వచ్చేట్టులేదని స్పష్టమయింది. ఎవరి సౌకర్యం వాళ్లు చూసుకుంటున్నారు. ఓ కదిలే ఫ్యాను కింద కదలకుండా పడేశాడు భద్రగజం తన వంద కిలోల శరీరాన్ని. వింత జంతువులా అరిచింది సెల్లు. ''రెండు రోజుల్లో వస్తున్నాను. అప్పటిదాకా బోన్లోనే వుంచండి'' అని తన పెద్దగొంతుతో చెప్పేసి వచ్చే అవులింతను అవులించి వదిలేశాడు. పక్కనేవున్న భార్య శ్రీకాళహస్తి - భర్త కంటే ఓ పదికిలోలు ఎక్కువనిపించే తక్కువ. అలిగి ఎడమొహం వేసింది. లేచి కొద్దిసేపు అటుయిటూ తచ్చా డింది. స్టేషన్లో ప్రకటనలు చదివింది. ఎవరో తెలిసినవాళ్లను పలకరించింది. ఇదిలా వుంటే - అమెరికా నుంచి వచ్చిన ఓ తెలుగు కుటుంబాన్ని వినోదంగా నోళ్లు తెరిచి కళ్లప్పగించి ఆనందిస్తున్నారు అక్కడున్న చాలామంది!**

నాలుగేళ్ల పిల్లవాడు - లంబోదరం. ముద్దుగా లంబో! తల్లి రాధా, తండ్రి మధు, తాత రామతీర్థ అదీ ఆ కుటుంబం.

భద్రగజాన్ని కూడా ఆకర్షించిన అంశం లంబోకి తల్లి అన్నం పెట్టడం. అయితేవాడు చేసే ఆగడం అంతా యింతాకాదు. పెద్దవాళ్ల గారాబంతో ఆడుకుంటున్నాడు వాడు అనుకున్నాడు భద్రగజం. పిల్లలు లేని తనకు సహజంగానే పిల్లలంటే ఎంతో యిష్టం. పెరిగే వయసులో పిల్లలు తినాల్సింది - తినిపించడానికి తల్లులు నానా అగచాట్లు పడుతున్నారీ రోజుల్లో - అనడానికి చక్కటి ఉదాహరణ ఆ సన్నివేశం.

నోటి దగ్గరకొచ్చిన చెంచాని విసిరికొట్టాడు. ఎగిరి ఎక్కడో పడింది. వెతికి జ్ఞాపికలా దాచి పెట్టుకోవడానికి కొందరు చెదురుమదురయ్యారు. ముద్దకలిపి ముద్దుగా మారిన తల్లి చేయి మళ్లీ దెబ్బతింది. మెతుకులు ఎగిసిపడి తెరిచిన నోళ్లకు కొన్ని - మొహాలకు కొన్ని కొట్టుకున్నాయి. భద్రగజానికి అర్థం కానిదొకటే యింత చేస్తున్నా పిల్లవాణ్ణి మందలించడం లేదెందుకు పెద్దవాళ్లు! ఇక తను చొరవ చేసుకోవాల్సిందే అనుకున్నాడు. తన భీకరాకారాన్ని చూసి పిల్లవాడు దారిలో కొస్తాడనే, తన పెద్దరికాన్ని ఆ పెద్దవాళ్లు చిన్న బుచ్చారులే అనే ధైర్యం మనసుని నెట్టడంలో అడుగు ముందుకు వేశాడు!

''ఇందాకటి నుండి చూస్తున్నాను. ఏంటి నీ మారాం. అల్లరి చేయకుండా అన్నం తింటావా లేదా. లేకపోతే నిన్ను పొట్లంగా చుట్టేసి నా పొట్టలో పెట్టేసుకెళ్తా'' అన్నాడు. మీరు పిల్లవాణ్ణి భయపెట్టే ప్రక్రియ చేయట్లేదన్న సందేశాన్ని అంతర్లీనంగా ఆ పెద్ద వాళ్లకిచ్చానన్న సంతృప్తి ప్రకటిస్తూ - మరుక్షణంలో తన మొహం మీద కరాటే కిక్కు పడుతుందని ఊహించలేదు! దవడలు అటువిటువయ్యాయా అన్నంతగా నొప్పి లేస్తున్నది. కొట్టింది పిల్లవాడేనా అన్న అనుమానం కూడా వచ్చింది. అటువంటి దెబ్బలు జంతువులతోనే ఎన్నో తిన్న అనుభవం వున్నవాడు కాబట్టి తొందరలోనే కోలుకున్నాడు. ఆ దెబ్బతో - పరామర్శలు పరిచయాలుగా మారాయి. వాళ్లూ వీళ్లూ ఒకే వూరికి ఒకే యింట్లోకి పెళ్లికి వెళ్తున్నారని తెలుసుకున్నారు. రైలొచ్చి ఎక్కి కూర్చున్న తర్వాత ఒకే కూపేలో ప్రయాణం అనీ తెలుసుకున్నారు.

***

''పిన్నిగారు ఏదన్నా మౌనవ్రతంలో వున్నారా'' అమాయకంగా అడిగింది రాధ.

''లేదమ్మా. ఎక్కడికెళ్లినా నైటీ అలవాటయి ప్రయాణం కూడా అలాగే చేస్తానంది. నేను బావుండదన్నాను. అలిగి పళ్లు బిగపట్టింది'' చెప్పాడు భద్రగజం.

''కట్టుబట్టలపై కూడా మగవాళ్ల ఈ పట్టు సడలిందాకా నిశ్శబ్ద విప్లవంతో కట్టుదిట్టంగా విజయం సాధిద్దామనుకున్నానమ్మా'' కృత నిశ్చయంతో వెలిబుచ్చింది శ్రీకాళహస్తి.

''హమ్మయ్య పిన్నిగారు మాటల్లో కొచ్చారు'' అంది రాధ.

''ఎందుకు రాదమ్మా, రాధమ్మా! యిందాక మీ వాడికిచ్చిన కిక్కుకే నవ్వును కుక్కుకుంది. యింకా మీ లంబోదరం వడ్డనలు నాకెన్నున్నాయో అని లోపల్లోపల లెక్కలేసుకుంటుంటే'' అన్నాడు భద్రగజం.

''వడ్డనలు అంటే ఏంటి'' యింగ్లీషులో అడిగాడు లంబో.

''నీకు స్వీటూ నాకు హాటు - నాయనా'' అన్నాడు భద్రగజం నవ్వుతూ - మాటల్లో తన ఉద్యోగం జూలో అని చెప్పాడు.

''మీరెవరితోనో - బోన్లో పెట్టండి అని ఫోన్లో చెప్పినప్పుడే అనుకున్నా. బావుంది!

మీరు జూలో పని చేస్తున్నారు. మా నాన్న జువాల్జీ లెక్చరరుగా పని చేసి రిటైరయ్యారు. మీ యిద్దరికీ బోల్డెంత కాలక్షేపమన్న మాట'' అంది రాధ.

''పులిని పట్టినవాడు పిల్లిని చూసి బెంబేలెత్తినట్లు - లంబోతో లబోదిబోలు చాలు బాబాయిగారికి'' అన్నాడు మధు చదువుతున్న పుస్తకాన్ని క్షణం పక్కనపెట్టి.

''అంతంత జంతువులతో గడిపే ఆయనకు మనవాడో లెక్కా'' అన్నాడు రామతీర్థ. తను చదువుతున్న పుస్తకంలో పేజీకి గుర్తుపెట్టి.

''నో బద్గజాం తాతే బిగ్ ఎలిఫెంట్'' అన్నాడు లంబో.

శ్రీకాళహస్తి పెద్దగా నవ్వింది.

''చూశావా నన్నేనుగనగానే మీ పిన్నిగారికి ఎంత ఆనందమో'' అన్నాడు భద్రగజం.

''నేను నవ్వింది. మీ పేరు వాడి నోరు తిరక్క ముద్దుగా అన్నందుకండీ. అయినా అది కూడా ఎంత సేపులే నన్ను కూడా ఏదో ఒకటి అనే దాకనేగా'' అంది శ్రీకాళహస్తి.

''ఆడవాళ్లెనెవరినీ ఏమీ అనడు పిన్నిగారూ'' చెప్పింది రాధ.

''అదో అదృష్టం'' అన్నాడు రామతీర్థ - పుస్తకంలో పేజీ తిప్పుతూ.

''అవును పిన్నిగారూ - నైటీ గురించి మీరంత పట్టుగా ఎందుకున్నారు'' అసలు విషయం ప్రస్తావించడానికి సమయం దొరికించుకుంది రాధ.

''ఈ ఆకారానికి చీరకట్టడం ఎంత కష్టమో నీకేం తెలుస్తుందమ్మా. రివటలాగా నాజూగ్గా వున్నదానివి'' అంది శ్రీకాళహస్తి.

''అవున్లే ఆ వంటికి యిరవై గజాల గుడ్డ చుట్టడం మామూలు మాట కాదనుకో'' అన్నాడు భద్రగజం నవ్వుతూ.

''వాడితో ఆడుకోండి లేకపోతే పడుకోండి. మా మాటల్లోకి రాకండి'' అన్న భార్య మాటను గౌరవించక తప్పలేదు భద్రగజానికి.

లంబో అలసిపోయి నిద్రలోకి వెళ్లడంతో ప్రయాణం హాయిగా సాగింది.

***

రైలు దిగ్గానే - కాళ్లకు తోడుగా చేతులు కూడా కాళ్లయి - అంగలేస్తున్నాడు భద్ర గజం - పైన లంబో సవారీ చేస్తున్నాడు.

''లంబోదరుడి వాహనం ఎంత పెద్ద ఎలకో! అవును, మరిచిపోయా - ఏనుగాట కదా - మరి అంకుశం వుండాలిగా'' అంది శ్రీకాళహస్తి.

''అదేదో కావాలీ'' అంటూ భద్రగజం జుట్టుపీకాడు లంబో.

''అదెందుకు నాయనా, నీ చేయి చాలు'' అన్నాడు భద్రగజం.

''నో, నాకదే కావాలి'' అరిచాడు లంబో.

వెంటనే యివ్వకపోతే పిల్లవాడు ఎక్కిళ్లుపడి కళ్లు తేలేస్తాడని అందరికీ తెలుసు. అటువంటి వస్తువు కోసం తలోరకంగా ప్రయత్నం చేశారు. తన బిగ్‌షాపర్ సంచీ కర్రొకటి లాగి యిచ్చింది శ్రీకాళహస్తి.

''చూస్తున్నారుగా నా విషయంలో మా ఆవిడ బుర్ర ఎంత స్పీడ్‌గా పని చేస్తుందో'' అన్నాడు భద్రగజం.

''దొరక్క దొరక్క దొరికింది. మీకు పిల్లవాణ్ణి ఆడించే ముద్దు. మీతో ఆడుకోవడం వాడి ముద్దు.



వాడి ముద్దే మనందరి ముద్దు కదా'' అంది శ్రీకాళహస్తి... ఆ కర్రతో భద్రగజం వీపు మీదొకటి వేశాడు లంబో.

''ఏనుగు కొడితే కదలదు నాయనా – చెవిలో గుచ్చాలి'' దర్శకత్వం చేసింది శ్రీకాళహస్తి.

''మీరాగండి పిన్నిగారూ – ఏంటిది బాబాయి గారు, ఎంత ముద్దయితే మాత్రం నలుగురిలో యిట్లా – యింట్లోలాగా'' అంది రాధ లంబోని ఎత్తుకుంటూ.

''ఇల్లయితేనేం, బయటయితేనేం మనిష్టం మనది. ఎవరో ఏదో అనుకుంటారనుకుంటే కుదించి కు పోతామమ్మా'' అన్నాడు భద్రగజం.

''అదే సూత్రం నా నైటీ విషయంలో ఎందుకు వర్తించదో'' అంది శ్రీకాళహస్తి.

''నైటీ అంటే నైటే వేసుకోవాలోయ్'' అన్నాడు భద్రగజం.

''డే అండ్ నైట్‌గా దాని పేరు ఎప్పుడో మార్చేశా, ఆ సంగతి మీకు తెలీదేమో''

''ఆపండి మీగోల'' యింగ్లీషులో కేకేశాడు లంబో.

ఈ లోపులో విడిదింటికి వీళ్లని తీసికెళ్లడానికి రెండు వ్యాన్లు వచ్చాయి.

''ఏమోయ్! ఆ వ్యాన్లు మనిద్దరికే సరిపోతాయి. పాపం వీళ్ల సంగతేంటి'' అన్నాడు భద్రగజం'' నవ్వుతూ.

''ఓ వ్యాన్లోపల నేను వ్యానుపైన మీరు సర్దుకుందాం లెండి గాని – లగేజీ ఎక్కించే పని చూడండి ముందు'' అంది శ్రీకాళహస్తి.

తీరా చూస్తే శ్రీకాళహస్తి బెడ్డింగు కనిపించలేదు!

పోయిందని నిర్ధారించుకున్నారు. ఎందుకంటే రైల్లో బోర్డింగప్పుడే బెడ్డింగు మరచి పోయిన సంగతి గుర్తుకొచ్చింది.

''కట్టుకున్న బట్ట తప్పితే కట్టుకోడానికి యింకో బట్టలేదు. పెళ్లిలో ఏం కప్పుకు తిరుగుతావో ఏంటో'' అన్నాడు భద్రగజం జాలిగా.

''అది నా సమస్యలెండి గాని – ముందు మీరు కదలండి – వ్యాన్లు మన దగ్గరే అట్టే పెట్టుకుంటే అక్కడ పెళ్లివాళ్లకేం పనులున్నాయో ఏంటో'' అంది శ్రీకాళహస్తి.

''అవును అదీ నిజమే'' అన్నాడు భద్రగజం.

''అదే నిజం'' అంది శ్రీకాళహస్తి.

***

''ఏమో అనుకున్నాగానీ. భలే సరదాగా వుంటారండీ మీరు.. మీరు అంటే మీరూ బాబాయిగారూనూ. మమ్మల్ని చూస్తున్నారుగా – మా ఆయనకీ మా నాన్నకీ పుస్తకం చేతిలో వుంటే చాలు ప్రపంచాన్ని మరచిపోతారు'' అంది రాధ విడిదింట్లోకి వస్తూ.

''మాకింకేం కాలక్షేపం చెప్పమ్మా. ఏం చేసినా మా ఆకారాలు మారేవి కావు. పిల్లలు పుట్టినా పెంచే ఓపిక లేని వాళ్లమనుకున్నాడో ఏమో ఆ దేవుడు! ఎవర్నో తెచ్చి పెంచి వంశాన్ని పొడిగించడానికి మీ బాబాయి గారెందుకో సుముఖంగా లేరు. పిల్లల మీద మమకారంతో మా యింట్లో చిన్నపాటి జూ తయారైంది. చిన్న జూలో నన్ను పడేసి పెద్ద జూకి ఆయన ఉద్యోగానికి వెళ్తారు. ఏదో–కాలంలో కలిసిపోయిందాకా కాలం గడుపు తున్నాం'' అంది ఆనందంలో నిర్లిప్తను కలిపి.

''ఎవరైనా అంతేగా పిన్నిగారూ – అటూ యిటూ తేడా అంతే'' అంది రాధ నవ్వుతూనే.

పెళ్లివాళ్ల కాఫీని ఆనందంగా తాగుతున్నారు యిద్దరూ.

అప్పటిదాకా ఎక్కడో ఆడుకుంటున్న లంబో వచ్చాడు. ''బట్టర్ ఫ్లై... బట్టర్ ఫ్లై.... క్యాచిట్... క్యా...చిట్'' అంటూ శ్రీకాళహస్తి భుజం మీద కాళ్లు పెట్టి, సోఫా మీదకి దూకాడు. శ్రీకాళహస్తి వంటి నంటి వున్న ఒక్క చీరకాస్తా కాఫీ గుడ్డయింది.

''పెళ్లింట్లో కొచ్చి పెళ్లి చూడకుండా చేశావు గదరా పిన్నిగార్ని'' అంది రాధ. లంబో వినే ధ్యాసలో లేడు.

''వాణ్ణేమనకమ్మా. ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం వుంటుంది. ఒక్కోసారి సమస్యలే ఎన్నో సమస్యలకి పరిష్కారమవుతాయి'' అంటూ లేచింది శ్రీకాళహస్తి.

''ఏముంది – ఏ డబుల్ కాట్ బెడ్‌షీటో వళ్లంతా కప్పుకోవడమే మిగిలింది'' అన్నాడొచ్చి భద్రగజం.

''పెళ్లి చూసేది మన కళ్లు. మన వళ్లు కాదు అది గుర్తు పెట్టుకోండి'' అంది శ్రీకాళహస్తి.

''పెళ్లి మానేసి అందరి కళ్లూ మనవళ్లే చూస్తాయి మరి'' అన్నాడు భద్రగజం.

''పోనీలెండి. ఏ తలుపు సందులోంచో చూస్తాలెండి గాని. కాస్త మీరు అవతలకి వెళ్లండి'' అంది శ్రీకాళహస్తి.

''అలనాడు ద్రౌపదికి వస్త్ర ప్రదానం చేసిన గోపాల దేవుడే నిన్నేదో విధంగా ఆదుకోక పోతాడా'' అంటూ లంబోని భుజమెక్కించుకుని వెళ్లాడు భద్రగజం.

***

''అక్కడ మేనమామలు అమ్మాయిని బుట్టలో కూచోబెడుతున్నారు. నువ్వింకా తెమిలి బయట పడేట్లు లేవు'' అన్నాడు భద్రగజం హడావిడిగా వచ్చి. మంచం చాటుగా శ్రీకాళహస్తి తల ఒక్కటే కనబడుతున్నది.

''ఏం చేయమంటారు. రాధ యిచ్చిన రెండు చీరలు కూడా నా చుట్టుకి అందడం లేదు. నేనేం చేయాలో పాలుపోవడం లేదు'' అంది శ్రీకాళహస్తి.

''ఓ నాలుగైదు చీరలు కలిపి కుట్టించి కట్టుకోక పోయావా'' అన్నాడు భద్రగజం.

''ఇప్పుడు కూడా మీ జోకులేంటండి. మొన్న కొన్న కొత్త నైటీ నా హ్యాండ్ బ్యాగ్‌లోనే వుంది. అదే నన్ను కాపాడింది'' చిన్నగా బయటికి వచ్చి నైటీలో దర్శనమిచ్చింది శ్రీకాళహస్తి.

''అమెరికాలో అన్నేళ్లుండి వచ్చిన రాధే తెలుగింటి ఆడపడుచులా శోభిల్లుతుందోయ్. గడపదాటితే నైటీతో తిరగడమే నవ నాగరికత అనుకునే నీలాంటి వాళ్లకిదే బాగుంటుందేమోలే'' అన్నాడు భద్రగజం మనసులో అసహనాన్ని కప్పిపుచ్చి.

''సరైతే. నన్నో తట్టలో కూర్చోబెట్టి మీ నెత్తి నెక్కించుకుని పెళ్లిలో తిప్పండి. ఏం చేస్తాం, నా యిష్టం మీకు అయిష్టం'' అంది శ్రీకాళహస్తి. నవ్వులో కోపాన్ని కలిపి.

''నిన్నుడికించాలని అన్నాగాని – నిజంగా నైటీలో నువు చాలా అద్భుతంగా వున్నావోయ్'' అన్నాడు భద్రగజం. పరిస్థితి చేయి జారిపోకుండా వుండాలని.

బయల్దేరే తొందరలో గడప కొట్టుకుని కింద పడింది. లేవడానికి పది నిమిషాలు పట్టింది. కానీ నొప్పి నుంచోనిచ్చేట్లు లేదు!

అప్పటికప్పుడు చక్రాల కుర్చీ ఏర్పాటు చేయించాడు భద్రగజం.

''ఏమండోయ్. యిదిగోండి స్టేషన్లో మీరు మరచి పోయిన బెడ్డింగు. యిదే పెళ్లికి మేం కూడా వస్తున్నాం కాబట్టి సమయానికి తీసుకురాగలిగాం'' అన్నాడో రైల్వే పోలీసు మామూలు దుస్తుల్లో వచ్చి.

''అది మాదేనని ఎలా కనిపెట్ట గలిగారు'' అనుమానంగా అడిగాడు భద్రగజం.

''బెడ్డింగులో పెట్టిన వెడ్డింగు కార్డు చూసి'' చెప్పాడు పోలీసు.

''అద్సరే – యీ బెడ్డింగు మా ఆవిడదేనని ఎలా చెప్పగలిగారని'' తర్కించాడు భద్ర గజం. తడబడ్డాడు పోలీసు. భద్రగజం గొంతు పెంచడంతో.

''బెడ్డింగులో వున్నా నైటీ కొలతలు పోల్చుకుని'' చెప్పాడు పోలీసు.

''అదీ పోలీసు బుర్రంటే. అంతా బాగానే వుంది గానీ. అరగంట లేటుగా వచ్చారు. అదే మీరు చేసిన పొరబాటు'' అన్నాడు భద్రగజం.

''లేదండీ. అమ్మగారు చెప్పిన టైంకే వచ్చామే'' అన్నాడు పోలీసు.

''ఆ!!'' అన్నాడు భద్రగజం.

☆

రాంపా

9849863672

